ప్రజాశక్తి
గురువారం 11 జనవరి 2024



జెడ్పీ సిఇఒగా నదియా దేవి



ప్రజాశక్తి అనంతపురం కార్పొరేషన్

ఉమ్మడి అనంతపురం జిల్లా జెడ్పీ సిఇఒగా ఐఎఎస్ అధికారి నదియాదేవిని నియమిస్తూ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ డాక్టర్ జవహార్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె ఐఎఎస్ ట్రైనింగ్ పూర్తిచేసుకుని పోస్టింగు కోసం వెయిట్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నదియాదేవిని పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ కింద జెడ్పీ సీఈవోగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ ఉత్తర్వులు ఈనెల 8న జారీ అయినట్లు తెలుస్తోంది. ఈమె శుక్రవారం బాధ్యతలు చేపట్టే అవకాశం ఉన్నట్టు అధికార వర్గాలు తెలిపాయి.

అంగన్వాడీల ఆగ్రహజ్వాల..!

సమ్మె 30వ రోజు



30వ నెంబర్ ఆకారంలో కూర్చొని నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్వాడీలు

తమ సమస్యల పరిష్కారం కోసం శ్రీసత్యసాయి జిల్లాలోని ఆయా మండలాల్లో అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారానికి 30వ రోజుకుచేరుకుంది. ఈనందర్భంగా పుట్టపర్తిలో ఎదుట అంగన్వాడీలు వినూత్న నిరసన చేపట్టారు. తాము సమ్మె చేపట్టి 30 రోజులు అయిన సందర్భంగా 30వ సంఖ్య ఆకారంలో రోడ్డుపై కూర్చొని నిరసన తెలిపారు.

వార్తలు 6లో

మున్సిపల్ కార్మికుల నిరసన హోరు

సమ్మె 16వ రోజు

తమ సమస్యల పరిష్కారం కోసం శ్రీసత్యసాయి జిల్లాలోని ఆయా మున్సిపాలిటీల్లో మున్సిపల్‌కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె 16వ రోజు కొనసాగింది. ఆయా మున్సిపాలిటీల్లో అంగన్వాడీలు బుధవారం వినూత్న నిరసన చేపట్టారు. పుట్టపర్తి మున్సిపల్ కార్యాలయం ముందు కార్మికులు వినూత్న నిరసన చేపట్టారు. కళ్లకు గంతలు కట్టుకుని, అర్ధనగ్నంగా మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. 16 రోజులుగా నిరవధిక సమ్మె కొనసాగిస్తున్న ప్రభుత్వంలో చలనం రాకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు.

వార్తలు 6లో



పుట్టపర్తి మున్సిపల్ కార్యాలయం ముందు కార్మికుల వినూత్న నిరసన

ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరసనాగ్రహం

సమ్మె 22వ రోజు



ఎస్ఎస్ఏ ఉద్యోగుల వినూత్న నిరసన

తమ సమస్యల పరిష్కారం కోసం సత్యసాయి జిల్లాకేంద్రంలో ఎస్ఎస్ఏ ఉద్యోగులు వినూత్న నిరసన చేపట్టారు. బుధవారం 22వ రోజు సమ్మెలో భాగంగా జెఏసి అధ్యక్షులు ఓబిరెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులు బూతప్పల వేషంలో నిరసన తెలిపారు. నిరవధిక సమ్మె కొనసాగిస్తున్న ప్రభుత్వంలో చలనం రాకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి వీరి నిరసనకు మద్దతు తెలిపారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్, జెఏసి నాయకులు రమణ, రామసుబ్బారెడ్డి, మల్లిఖార్జునరెడ్డి, ఓబులేసు, హరిప్రసాద్, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వార్తలు 6లో

అటకెక్కిన ఆధునీకరణ పనులు

నీళ్లు లేవంటూ జగడాలు
నిధులు రాబట్టడంలో మౌనం



ప్రజాశక్తి -అనంతపురం ప్రతినిధి

నిత్యం దుర్భిక్ష ప్రాంతమైన అనంతపురం జిల్లాకు సాగునీటి ఆవశ్యకత చాలా అవసరముంది. అయితే ఉన్న అతి కొద్ది సాగునీటి వసతిని సక్రమంగా అందించే నీటి వ్యవస్థల్లేక రైతులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలోనున్న ఏకైక ప్రధాన ప్రాజెక్టు తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ. ఈ సిస్టమ్ కింద అనేక ఉప కాలువలు ఉన్నాయి. ఇప్పుడు ఈ వ్యవస్థలన్నీ పూర్తి దెబ్బతిన్నాయి. వీటిని బాగు చేసేందుకు చేపట్టిన ఆధునీకరణ పనులన్నీ అర్ధాంతరంగా ఆగిపోయాయి. వీటిని తిరిగి ప్రారంభించేందుకు చర్యలు తీసుకునే విధంగా ప్రభుత్వంపై నేతలు ఒత్తిడి పెంచిన దాఖలాలు కనిపించలేదు. ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా 12 మంది వైసిపి ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిందన్న విమర్శలున్నాయి.

అటకెక్కిన ఆధునీకరణ పనులు

ఆగిన తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఆధునీకరణ :

తుంగభద్ర డ్యామ్ నుంచి అనంతపురం జిల్లాకు సాగునీటి వనరు ఇచ్చిన ప్రధాన కాలువ ఆధునీకరణ పనులు 2008లో ప్రారంభమయ్యాయి. నాలుగేళ్లలో తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువను పూర్తి స్థాయిలో ఆధునీకరించడంతోపాటు ప్రవాహ సామర్థ్యాన్ని 2000 క్యూసెక్కుల నుంచి 4200 క్యూసెక్కులకు పెంచారు. ఆరు ప్యాకేజీలతో రూ.458.72 కోట్లతో చేట్టారు. ఇందులో 309.74 కోట్లు పూర్తయ్యాయి. అయితే ఆ తరువాత పనులను ఆపివేశారు. వైసిపి అధికారంలోకి వచ్చాక 2019లో రద్దు చేసింది.

మిడ్‌పెన్నార్ దక్షిణ కాలువ ఆధునీకరణ ఆపమని కాంట్రాక్టరు వినతి

శింగనమల నియోజకర్గానికి సాగు,తాగునీటిని అందించే మిడ్ పెన్నార్ దక్షిణ కిలువ ఆధునీకరణ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. ఇక పనులు చేయలేమని రద్దు చేయమని కాంట్రాక్టరు విజ్ఞప్తి చేయడం గమనార్హం. మిడ్‌పెన్నార్ డ్యామ్ నుంచి 84 కిలోమీటర్ల మేరకు ఈ కాలువ ఉంది. రూ. 509.16 కోట్లతో పనులు చేపట్టడంతో రూ.205.79 కోట్లు పనులు పూర్తయ్యాయి. ఇప్పుడు ఆపనులు ఆగిపోయాయి.

గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ పనులు చేయలేం

గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ పనులు చేయలేమని కాంట్రాక్టర్లు చేతులెత్తేశారు. రూ.293.22 కోట్లతో చేపట్టిన పనుల్లో రూ.188 కోట్లు పూర్తయ్యాయి. ఈ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. వీటిని చేయలేమని పనులు రద్దు చేయమని కాంట్రాక్టర్లు విజ్ఞప్తి చేశారు. ఇలా ప్రధానమైన కాలువ పనులన్నీ మధ్యలోనే ఆగిపోయాయి.

నిమ్మకాయ గొంతులో ఇరుక్కుని చిన్నారి మృతి

విషాదంలో తల్లిదండ్రులు

ప్రజాశక్తి-పెద్దవడుగూరు



చిన్నారి మృతదేహంపై పడి రోధిస్తున్న తండ్రి

ఇంటి వద్దనే ఎంతో ఉత్సాహంగా ఆడుకుంటున్న చిన్నారిని మృత్యువు ఓ నిమ్మకాయ రూపంలో చిదిమేసింది. వివరాల్లోకి వెళ్తే.. పెద్దవడుగూరు మండలం మల్లేనిపల్లి గ్రామానికి చెందిన వాలంటీరు సకీదీప, గోవిందరాజులు దంపతులకు ఏడేళ్ల అనంతరం జశ్విత (9నెలలు) అనే చిన్నారి జన్మించింది. ఎంతో అల్లారి ముద్దుగా చూసుకుంటున్న ఆ చిన్నారి బుధవారం సాయంత్రం ఇంట్లో ఆడుకుంటోంది. దీంతో తల్లిదండ్రులు వారి పనిలో నిమగ్నమయ్యారు. ఈనేపథ్యంలో ఇంటి వరండాలో పడిన నిమ్మకాయను చిన్నారి నోట్లో పెట్టుకుంది. గమనించిన తల్లి సకీదీప చిన్నారి నోట్లో నిమ్మకాయను తీయబోయినా ఫలితం లేకుండా పోయింది. వెంటనే చికిత్స నిమిత్తం పెద్దవడుగూరు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చిన్నారి శ్వాసతీసుకోవడంలో ఇబ్బంది పడుతున్నందున మెరుగైన వైద్యం కోసం పామిడి ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు గుర్తించారు. చిన్నారి మృతితో ఆమె తల్లిదండ్రులు చేసిన రోదనలు కంటతడి పెట్టించాయి. ఏడేళ్ల తర్వాత పుట్టిన బిడ్డ తమకు లేకుండా చేస్తివా దేవుడా అంటూ రోధించారు.

కళ్యాణదుర్గం, రాయదుర్గం నుండి స్వతంత్రంగా పోటీ

ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి - రాయదుర్గం

రానున్న అసెంబ్లీ ఎన్నికలలో కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల నుంచి తాను, తన కుటుంబ సభ్యులు ఎన్నికల బరిలో ఉంటామని రాష్ట్ర ప్రభుత్వ విప్, రాయదుర్గం శాసనసభ్యులు కాపు రామచంద్రారెడ్డి చెప్పారు. అమరావతిలో తాను వైసిపికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించిన అనంతరం బుధవారం రాయదుర్గంలోని తన నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాపు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ తొలుత తనకు కళ్యాణదుర్గం అసెంబ్లీ టికెట్ ఇస్తామని చెప్పిన అధిష్టానం అనంతరం ఎక్కడా టికెట్ ఇవ్వడం లేదని చెప్పిందన్నారు. నిత్యం ప్రజలలో ఉంటూ ప్రజాసేవ చేసిన తనకు టికెట్ లేదని సమాధానం రావడంతో నిరాశ చెందిన తాను స్వతంత్ర అభ్యర్థిగానైనా తాను పుట్టిన సొంత నియోజకవర్గం కళ్యాణదుర్గంలో పోటీలో ఉండాలని నిర్ణయించుకున్నానని చెప్పారు. తనకు రాయదుర్గం, కళ్యాణదుర్గం రెండు కళ్లు లాంటివి అని అన్నారు. నేడు తనకు ఈ స్థాయిని కల్పించిన రాయదుర్గాన్ని ఎన్నటికీ మరిచిపోనన్నారు. అలాగే పుట్టి పెరిగిన కళ్యాణదుర్గం నియోజకవర్గంలో సేవ చేసే అవకాశం కోసం తాను ఈసారి అక్కడి నుండి పోటీ చేయనున్నట్లు ప్రకటించారు. తన ఆప్తులు, కుటుంబ సభ్యులు రాయదుర్గం నుండి ఎన్నికల బరిలో ఉంటారన్నారు. కాంగ్రెస్ పార్టీ నుండి పోటీ చేస్తారా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇస్తూ తనకు ఏ పార్టీ అవకాశం ఇచ్చినా కళ్యాణదుర్గం నుండి పోటీకి సిద్ధం అని అనాడే వెల్లడించానన్నారు. 2008 సంవత్సరంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి తన సొంత నియోజకవర్గం కళ్యాణదుర్గం నుండి పోటీ చేయమని సూచించినా మడకశిర నియోజకవర్గం ఎస్సీలకు రిజర్వ్ కావడంతో సీనియర్ కాంగ్రెస్ నేత రఘువీరారెడ్డి కళ్యాణదుర్గం నుండి పోటీ చేయగా తాను రాయదుర్గంనుంచి పోటీ చేయాల్సి వచ్చింది అన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ నుండి టికెట్ వచ్చినా పోటీకి సిద్ధమన్నారు. తన ఈ స్థితికి కారణమైన అహర్నిశలు చిత్తశుద్ధితో పనిచేసిన కార్యకర్తలు నాయకుల రుణం తీర్చుకుంటానన్నారు. తాను ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటానని, కష్టకాలంలో పారిపోయే వ్యక్తిని కాదని అన్నారు. ముందు నుంచి తాను పార్టీ కార్యకర్తల వెన్నంటే ఉన్నానన్నారు. ఎన్నికలలో గెలవాలని ఆశించే వ్యక్తి తనపై, తన అనుచరులపై బండ బూతులు సోషల్ మీడియాలో తిడుతున్నారని,మండల కన్వీనర్ వన్నూరు స్వామి, అతని భార్య ఎంపీపీని బెదిరిస్తున్నారని చెప్పారు. కొందరు వైసిపి నాయకులకు డబ్బు ఎరవేసి లోపర్చుకునే ప్రయత్నం చేస్తున్నట్లు తెలియ వచ్చిందన్నారు. రాయదుర్గం టికెట్ ఇంతవరకు ప్రకటించనప్పటికీ అంతా అయినట్లు సంబరపడుతున్నారని ఇల్లు అలికినంత మాత్రాన పండుగ అయినట్లు కాదని అన్నారు. సోషల్ మీడియాలో తనకు వ్యతిరేకంగా తప్పుడు పోస్టులు పెడితే వారికి తగిన సమయంలో తగిన రీతిన సమాధానం చెబుతానని హెచ్చరించారు. సిడబ్ల్యూసి సభ్యులు రఘువీరారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసినట్లు చెప్పారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్ యాదవ్, రాష్ట్ర హౌసింగ్ డైరెక్టర్ శ్రీనివాసులు, వైసిపి బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎన్‌టి సిద్దప్ప, మున్సిపల్ వార్డు సభ్యులు గోవింద, పెద్ద వన్నూరప్ప, షబ్బీర్, ఫక్రుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాపు రామచంద్రారెడ్డి

మంత్రి పెద్దిరెడ్డికి తాకిన 'పురం' అసమ్మతి సెగలు



- నవీన్ నిశ్చల్‌తో చర్చలు విఫలం
- పార్టీ కార్యాలయంలోనే చిలమత్తూరు నాయకుల తోపులాట
- రహదారి సమస్యపై మంత్రిని అడ్డుకున్న మహిళలు



పార్టీ కార్యలయంలో వాగ్వాదం చేసుకుంటున్న చిలమత్తూరు నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గంలో గ్రూపు తగాదాలు మంత్రి పెద్దిరెడ్డికి తలనొప్పులు తెస్తున్నాయి. మూడు రోజులుగా మంత్రి పెద్దిరెడ్డి నియోజకవర్గంలో పర్యటిస్తున్నా వైసిపి సీనియర్ నాయకుడు, హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గ మాజీ సమన్వయకర్త నవీన్ నిశ్చల్ పాల్గొనడం లేదు. ఈ నేపథ్యంలో మంత్రి పెద్దిరెడ్డి నవీన్ నిశ్చల్‌ను పిలిపించుకుని చర్చించినప్పటికీ ఫలితం లేకపోయింది. ఈ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని భవిష్యత్తులో సముచితమైన స్థానం కల్పించేందుకు తాను బాధ్యత తీసుకుంటానని పెద్దిరెడ్డి నవీన్‌కు భరోసా ఇచ్చినట్లు తెలిసింది. అయినా ససేమిరా అనడంతో ఒక దశలో పెద్దిరెడ్డి కూడా ఘాటైన హెచ్చరికలు చేసినట్లు చర్చ సాగుతోంది. బుధవారం నుండి తనతో పాటు కార్యక్రమాల్లో పాల్గొనకపోతే పార్టీ తీసుకునే క్రమశిక్షణ చర్యలకు సిద్ధంగా ఉండాలని మంత్రి పెద్దిరెడ్డి నవీన్ నిశ్చల్‌కు హెచ్చరించినట్లు విశ్వసనీయ సమాచారం. అయితే నవీన్ మాత్రం మంత్రి పాల్గొంటున్న కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు.

మంత్రిని అడ్డుకున్న గ్రామస్తులు

మూడు రోజుల నుంచి ఎంపీ అభ్యర్థి శాంతమ్మ, ఎమ్మెల్యే అభ్యర్థి దీపికలతో కలిసి మంత్రి పెద్ది రెడ్డి రామచంద్రా రెడ్డి అన్ని పంచాయితీల్లోను పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా లేపాక్షి మండలం మానేంపల్లి గ్రామంలో ఓ నాయకుడి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొని బయటకు వస్తుండగా గౌరిగాని పల్లి గ్రామానికి చెందిన మహిళలు మంత్రిని అడ్డుకున్నారు. తమ గ్రామానికి రహదారి లేక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఓట్ల కోసం వస్తున్నారేకాని తమ సమస్యలను పరిష్కరించమంటే ఏ ఒక్కరు పట్టించు కోవడం లేదని వారు మంత్రిని నిలదీశారు. చివరకు మంత్రి రోడ్డు వేయిస్తామని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు.

పార్టీ కార్యాలయంలోనే భగ్గుమన్న విబేధాలు

వైసిపికి పట్టు ఉన్న చిలమత్తూరు మండలంలో ఎంపిపి, జెడ్పీటీసీ వర్గాల మధ్య తీవ్రస్థాయిలో తోపులాట జరగడం అధికార పార్టీలో దుమారం రేపింది. మంత్రి పెద్దిరెడ్డి గురువారం చిలమత్తూరు మండలంలో పర్యటిస్తున్న నేపథ్యంలో స్థానిక వైసిపి కార్యాలయంలో ఆ మండల నాయకులతో నియోజకవర్గ సమన్వయకర్త దీపిక మంగళవారం రాత్రి సమావేశం నిర్వహించారు. చిలమత్తూరు మండల కన్వీనర్‌ను మార్చాలని జెడ్పీటీసీ మామ, సీనియర్ నాయకుడు గొల్ల నాగరాజు పట్టుబట్టారు. అయితే ఇందుకు ఎంపీపీ పురుషోత్తం రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పార్టీ మండల పార్టీ కన్వీనర్‌ను మార్చరాదని పట్టుపట్టారు. దీంతో ఎంపీపీ పురుషోత్తం రెడ్డి... గొల్ల నాగరాజు నడుమ తోపులాట జరగడంతో ఉద్రిక్తత నెలకొంది. దీంతో అక్కడ ఉన్న సీనియర్ నాయకులు జోక్యం చేసుకొని ఇరు వర్గాలకు నచ్చజెప్పి బయటకు పంపారు. ఒక దశలో జెడ్పీటీసీగా ఉన్న తన కోడలితో రాజీనామా చేయిస్తానని నాగరాజు చెప్పడంతో మంత్రి పెద్దిరెడ్డి సూచనల మేరకు కొందరు నాయకులు వెళ్లి ఆయనతో చర్చించినట్లు తెలుస్తోంది. ఇరు వర్గాలను రాజీ చేసేందుకు ప్రయత్నాలు చేశారు. మాజీ సమన్వయ కర్త కొండూరు వేణుగోపాల్ రెడ్డి, మంత్రి దూత కలిసి నాగరాజు వర్గంతో చర్చించారు. అయినప్పటికి చర్చలు ఫలించలేదు. పార్టీ కన్వీనర్‌తో పాటు నాడు చెప్పిన విధంగా ఎంపిపిని సైతం మార్చాలని ఆయన తెగేసి చెప్పినట్లు సమాచారం. ఏది ఏమైనా టిడిపి కంచుకోట అయిన హిందూపురంలో ఎలాగైనా వచ్చే ఎన్నికల్లో పాగా వేయాలని మంత్రి పెద్దిరెడ్డి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను వెంట వేసుకుని నియోజక వర్గంలోని అన్ని పంచాయతీల్లో పర్యటిస్తున్నారు. అయితే ఆయా పంచాయతీల్లో జరుగుతున్న సభలకు డ్వాక్రా మహిళలు మినహాయించి నాయకులు పాల్గొనడం లేదు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు మంత్రికి తలనొప్పిగా మారినట్లు తెలుస్తోంది.



మానేంపల్లిలో మంత్రిని అడ్డుకున్న మహిళలు, గ్రామస్తులు

ఎస్మా, నోటీసులకు బెదరం

ప్రజాశక్తి-పెనుకొండ

సమ్మెలో భాగంగా 30వ రోజైన బుధవారం అంగన్వాడీలు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన శిబిరంలో దీక్షలను కొనసాగించారు. శిబిరాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ సందర్శించి సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ అంగన్వాడీల 11 డిమాండ్లు పరిష్కరించేంత వరకూ సమ్మె కొనసాగిస్తామన్నారు. ఎస్మాకు భయపడం, అదరం, బెదరం అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ వ్యవసాయ కార్మిక సంఘం పెద్దన్న, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఫకృద్దీన్, మండల సిఐటియు నాయకులు తిప్పన్న, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు జయమ్మ, బావమ్మ, సెక్టార్ లీడర్లు మాబున్నీసా, వరలక్ష్మి, పాల్గొన్నారు.

కదిరి టౌన్ : దీక్షా శిబిరం వద్ద అంగన్వాడీలు ప్రభుత్వానికి దండాలు పెడుతూ వినూత్న రీతీలో నిరసన తెలిపారు. వారు మాట్లాడు తూ ప్రభుత్వం వెంటనే ఎస్మా రద్దు చేయాలని, షోకాజు నోటీసు లను వెనక్కు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు నరసింహులు, జగన్మోహన్, బాబ్జాన్, ఫాజిల్, నాయకురాళ్లు లక్ష్మీదేవి, శారద, చంద్రకళ, సుశీల, సువర్ణ, సుజాత పాల్గొన్నారు.

నల్లచెరువు : సమ్మెలో భాగంగా స్థానిక వేమన గుడి దగ్గర అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ 30 సంఖ్య ఆకారంలో కుర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఇచ్చిన మాట ప్రకారం సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె విరమించేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు రామకృష్ణ, రైతు సంఘం జిల్లా కౌన్సిల్ సభ్యులు శ్రీరాములు, వ్య.కా.సం. నాయకులు రమేష్ పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు దీక్షలను కొనసాగించారు. వీరికి ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎల్.ఆదినారాయణ, అయూబ్ఖాన్, రైతుసంఘం మండల అధ్యక్షుడు కొత్తపేట మారుతి, సీపీఐ నాయకులు పోలా లక్ష్మీనారాయణ మద్దతు తెలిపారు. వారు మాట్లాడు తూ అంగన్వాడీల సమస్యలను పరిష్కరించేంత వరకూ ఆందోళన విరమించే ప్రసక్తే లేదన్నారు. ప్రభుత్వ బెదిరింపులకు బెదిరేదేలేదన్నారు.

ఓబుళదేవరచెరువు : స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆఫీసు వద్ద అంగన్వాడీలు సమ్మెను కొనసాగించా రు. మండల పరిధిలోని మహమ్మదాబాద్ క్రాస్‌లో సిఐటియు నాయకులు లక్ష్మీనారాయణ మాట్లాడు తూ అంగన్వాడీల సమస్యలను పరిష్కరించకపోతే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు కుళ్లాయప్ప, అంగన్వాడీ కార్మికులు రంగమ్మ, మణిమాల, ఆశీర్వా దమ్మ, కిష్టమ్మ, కమలమ్మ, వరలక్ష్మి, అరుణమ్మ, అనసూయ, సుకన్య, అంగన్వాడీ కార్యకర్తలు, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్ : పుట్టపర్తి ఆర్డీఓ కార్యాలయం ముందు చేపట్టిన దీక్షలో హిందూపురం, మడకశిర, గుడిబండ, పుట్టపర్తి ప్రాజెక్టుల అధ్యక్ష, కార్యదర్శులు శోభారాణి, లావణ్య, నాగమణి, మహదేవమ్మ, ఉషారాణి, పద్మావతి, సుజాత, నాగమణి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ అంగన్వాడీలకు అన్ని వర్గాల ప్రజలు మద్దతు పలుకుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే సమ్మెను ఉధృతం చేస్తామన్నారు. శిబిరంలో 30 సంఖ్య ఆకారంలో కలశాలు ఉంచి వాటి చుట్టూ అంగన్వాడీలు ప్రదక్షిణలు చేస్తూ పాటలు పాడారు.



పెనుకొండలో శిబిరం వద్ద మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్

కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్, జిల్లా కోశాధికారి సాంబశివ, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ దిల్షాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి గౌతమి, వి.శ్రీదేవి, సిఎస్.శ్రీదేవి, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు : అంగన్వాడీలు సమ్మెలో కొనసాగుతుండడంతో ఐసిడిఎస్ అధికారులు బుధవారం అంగన్వాడీ కేంద్రాలకు ఉద్యోగ నియమ ఉల్లంఘన, సంజాయిషీ నోటీసులను అతికించారు. ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని నల్లమాడ, ఓబుళదేవరచెరువు, అమడుగూరు మండలాల్లో అంగన్వాడీ కేంద్రాలకు నోటీసులు అతికించే ప్రక్రియను ప్రారంభించారు. ప్రాజెక్ట్ యూనియన్ అధ్యక్షురాలు ఆశీర్వాదమ్మ, రంగమ్మ, మణిమాల మాట్లాడుతూ నోటీసులు ఎవరూ తీసుకుపోకపోవడంతో చేసేదేమీ లేక అధికారులు అంగన్వాడీ కేంద్రాలకు నోటీసులు అతికిస్తున్నారన్నారు. ఎవరు ఎన్ని చేసినా సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకూ సమ్మెలో కొనసాగుతామని వారు స్పష్టం చేశారు.

ముదిగుబ్బ : స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో అంగన్వాడీలు 30 సంఖ్య ఆకారంలో మానవహారంగా కూర్చుని నిరసన తెలిపారు. వీరికి సిపిఎం , సిఐటియు నాయకులు మద్దతు తెలిపారు. సమస్యలను పరిష్కరించని పక్షంలో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం, సిఐటియు నాయకులు మధుసూదన్‌రెడ్డి, ప్రజానాట్యమండలి బాబు, రజియా పాల్గొన్నారు.




ముదిగుబ్బలో 30 సంఖ్య ఆకారంలో కూర్చుని నిరసన



కదిరిలో దీక్షా శిబిరంలో కూర్చున్న అంగన్వాడీలు



నల్లచెరువులో 30 ఆకారంలో కూర్చొన్న అంగన్వాడీలు



ఓడిసిలో అంగన్వాడీ సెంటర్‌కు నోటీసు అతికించిన అధికారులు

హిందూపురంలో గెలుస్తాం

ఎమ్మెల్యే పద్మావతి మాటలు ఆమె విజ్ఞతకే వదిలేస్తున్నా : మంత్రి పెద్దిరెడ్డి

ప్రజాశక్తి-హిందూపురం

వచ్చే ఎన్నికల్లో హిందూపురంలో ఖచ్చితంగా గెలిచి, టిడిపి కంచుకోట హిందూపురంలో వైసిపి జెండా ఎగురవేస్తామని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంత్రి బుధవారం లేపాక్షి మండలంలో పర్యటించారు. మానేంపల్లి గ్రామంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జగన్ పాలన లో జనం సంతోషంగా ఉన్నారన్నారు. టిడిపి హయాంలో చంద్రబాబు ఎన్నికల హామీలు ఏ ఒక్కటి నెరవేర్చలేదన్నారు. సిఎం జగన్ వెనుకబడిన వర్గాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. కురుబ సామాజిక వర్గానికి చెందిన దీపిక హిందూపురం అసెంబ్లీ నుంచి పోటీ చేస్తారు. హిందూపురం పార్లమెంటు నుంచి బోయ-వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన శాంత బరిలో ఉంటారని ప్రకటించారు. వెనుకబడిన వర్గాలకు చెందిన ఇద్దరు మహిళలకు ఒకే చోట గతంలో ఏ పార్టీ అవకాశం ఇవ్వలేదన్నారు. కుప్పంలో చంద్ర బాబు, హిందూపురంలో బాలకృష్ణను కచ్చితంగా ఓడిస్తామన్నారు. కుప్పం ప్రజలు 7 సార్లు గెలిపించినా కనీసం తాగునీరు ఇవ్వలేదన్నారు. కుప్పంను రెవెన్యూ డివిజన్ చేసిన ఘనత జగన్‌దే అన్నారు. అనంతపురంలో శాసనసభ్యులు అక్రమంగా నీరు తీసుకుంటున్నా ఎక్కడా మనం ప్రశ్నించలేదు. చిత్తూరు, కడప జిల్లాలకు రావాల్సిన నీటి వాటా ఒక్కసారి కూడా మాకు అందలేదు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి

శింగనమల ఎమ్మెల్యే మాటలు ఆమె విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. కుప్పంలో ఓటమి భయంతోనే చంద్రబాబు మరో నియోజకవర్గం వెతుక్కుంటు న్నారు. ఒకవేళ మరో దగ్గర పోటీ చేస్తే ఆయన ఓటమి అంగీకరించినట్లే అన్నారు. మేము టికెట్ నిరాకరిస్తే కొందరు టిడిపి వైపు చూస్తున్నారన్నారు. కొన్ని పరిస్థితుల వల్ల ఇక్కడ్లేని పోటీ నుంచి తప్పించాల్సి వచ్చిందన్నారు. గోరంట్ల మాధవ్‌కు పార్టీలో తగిన ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. టిక్కెట్ కేటాయింపులో ఉన్న కొంత అసంతృప్తిని త్వరలో అధిగమిస్తాము న్నారు. ఏపిలో కాంగ్రెస్ పార్టీ ఉనికి కోల్పోయింది. ఎన్నికల్లో సచివాలయ సిబ్బందిని ఉపయోగించుకుం లేదన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌కు అవగాహన లేక ఈసీకి ఫిర్యాదు చేశారన్నారు. నిజమైన రాయలసీమ ద్రోహి చంద్రబాబే అన్నారు. హిందూపూర్ వైసిపిలో వర్గ విభేదాలు ఉండవు. మంత్రితో పాటు శాంతమ్మ, దీపిక ఉన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : మంత్రి

ప్రజాశక్తి-గోరంట్ల రూరల్

అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమమే సిఎం జగన్ లక్ష్యమని మంత్రి ఉషశ్రీచరణ్ పేర్కొ న్నారు. మండల పరిధిలోని గుమ్మయ్యగారి పల్లి వద్ద ఉన్న రంగమహల్‌లో బుధవారం నిర్వహించిన వైసిపి మండల విస్తృతస్థాయి సమావేశానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతిఒక్కరూ వర్గ విభేదాలను పక్కనపెట్టి వైసిపి గెలుపునకు కష్టపడాలని కోరారు. నేను గెలిస్తే మీ ఇంట్లో ఆడబిడ్డ గెలిచినట్లే అన్నారు. వర్గ విభేదాలకు తావివ్వకుండా అందరినీ సమానంగా చూస్తా న్నారు. ఎవరైనా సరే నా కార్యకర్తల జోలికి వస్తే ముందు నన్ను దాటుకుని వెళ్లాలన్నారు. వైసిపిలో ఎవరిపైనైనా అనవసరంగా కేసులు నమోదై ఉంటే వాటిని న్యాయబద్ధంగా తొలగించేందుకు పోలీసు అధికారులతో చర్చిస్తామనని హామీ ఇచ్చారు. ప్రణాళిక ప్రకారం నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో పర్యటించి వైసిపి అమలుచేసిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ప్రజలు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్

అప్రమత్తంగా ఉండాలని చంద్రబాబు మాటలు మోసపోవద్దు అని సూచించారు. కార్యక్రమంలో వాల్మీకి బోయ కార్పొరేషన్ చైర్మన్ పొగాకు రామ చంద్ర, ఎంపిపి ప్రమీల, జడ్పిటిసి పాలే జయరాం నాయక్, సర్పంచి సరోజ నాగేనాయక్, ఉప సర్పంచి రాజారెడ్డి, వైస్ ఎంపిపి నాగభూషణ్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ బూదిలి వేణుగోపాల్ రెడ్డి, నాయకులు గంపల రమణారెడ్డి, పాటూరి శంకర్‌రెడ్డి, శివమణి రెడ్డి, అంగడి నారాయణరెడ్డి, విజయసింహారెడ్డి, భాస్కర్‌రెడ్డి, నాగరాజు, సాయి, గుణశేఖర్‌రెడ్డి, రెడ్డివారి రవి, కార్యకర్తలు పాల్గొన్నారు.

'మొర ఆలకించండి'

వినూత్నరీతుల్లో మున్సిపల్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

మున్సిపల్ కార్యాలయం ముందు కార్మికులు చేపట్టిన నిరవధిక నిరసన దీక్షలు 16వ రోజుకు చేరుకున్నాయి. పారిశుధ్యం, భూగర్భ డ్రెయినేజీ ఇంజినీరింగ్ కార్మికులు కళ్లకు గంతలు కట్టుకొని అర్ధనగ్నంగా మోకాళ్లపై నిలబడి మా మొర ఆలకించండి అంటూ చేతులతో దండాలు పెట్టి నిరసన తెలిపారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్య దర్శి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వీధుల్లో చెత్త చెదారం పేరుకుపోయి దుర్గంధం వెదజల్లు తున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదన్నా రు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మికులు పెద్దన్న, గోవిందు, రామయ్య నాగార్జున, నరసింహులు, రమేష్, రమణ, రామదాసు, నాగరాజు, పెద్దన్న, నాగభూషణ, పోతులయ్య, తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : ప్రభుత్వానికి తమ సమస్యలు పట్టవా అనిమున్సిపల్ కార్మికులు ప్రశ్నించ్చారు. సమ్మెలో భాగంగా 16వ రోజైన బుధవారం మున్సిపల్ కార్మికులు మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విధులను బహిష్కరించి దీక్షలను కొనసాగించారు. ప్రభుత్వం మొండి వైఖరి వీడి సమస్యలను పరిష్క రించాలని కార్మికులు నినాదాలు చేశారు. దీక్షలో యూనియన్ నాయకులు బాలకృష్ణ, సూరి, జనార్ధన్, చెన్నకృష్ణ, రాజేష్, చంద్రప్ప, రాజు, రామానుజులు, జగన్మోహన్, బాబ్జాన్, ముస్తాక్ పాల్గొన్నారు.



పుట్టపర్తిలో అర్ధనగ్నంగా కార్మికుల నిరసన

పెనుకొండ : నగర పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి సవితమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు కార్మికులు చేపట్టిన దీక్షా శిబిరన్నా ఆమె సందర్శించి సంఘీభావం తెలిపారు. సవితమ్మ మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించలేని అసమర్థ ప్రభుత్వం ఇది అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్, టీడీపీ నాయకులు కార్యకర్తలు, కార్మికులు, పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

ఓబుళదేవరచెరువు : బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం స్వచ్ఛభారత్, పంచాయతీ కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. మండల కార్యదర్శి శ్రీరాములు మాట్లాడుతూ వారికి వెంటనే వేతనాలు చెల్లించాలని, గుర్తింపు కార్డులు, యూని ఫామ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిచో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంజనప్ప, రామప్ప, నిర్మల, నరసిం హులు, లక్ష్మీనారాయణ, భాగ్యమ్మ, సాలమ్మ, నరేష్, స్వచ్ఛభారత్, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : మున్సిపల్ కార్మికుల సమ్మె కొనసాగింది. వీరికి సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మధు సంఘీబావం తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి అయూబాఖాన్, మున్సిపల్ కార్మికసంఘం గౌరవ సలహాదారులు పెద్దక్క, వెంకటేశులు, సెక్రటరీ చెన్నకేశవులు, కోశాధికారి లక్ష్మీ ఓబుళేసు, ఉపాధ్యక్షుడు ప్రసాద్, జాయింట్ సెక్రటరీ ముకుంద, కార్మికులు దుర్గమ్మ, నర్సక్క, నారాయణస్వామి, మారుతి, అడ్రా మహేశ్, బొగ్గునాగరాజు, సాకే బాబు, అనిల్‌కుమార్, దాసరి సురేశ్, అంకే పెద్దన్న, పరమేశ్, యోగేశ్ పాల్గొన్నారు.



పెనుకొండలో మున్సిపల్ కార్మికులకు మద్దతు తెలుపుతున్న సవితమ్మ



కదిరిలో దీక్షా శిబిరంలో బైఠాయించిన మున్సిపల్ కార్మికులు

నేరాలు ఘోరాలు

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

బత్తలపల్లి : మండల పరిధిలో బుధవారం జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు గాయపడ్డారు. పోలీసుల వివరాల మేరకు.. గోరంట్ల మండలానికి చెందిన వెంకటేష్ ద్విచక్ర వాహనం పై ధర్మవరం నుంచి బత్తలపల్లి వైపు వస్తుండగా బత్తలపల్లి మండలం అప్పరాచెరువు గ్రామానికి చెందిన చంటి అలియాస్ నారాయణస్వామి బత్తలపల్లి నుంచి ధర్మవరం వైపు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ఢీ కొన్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరూ గాయపడ్డారు. బత్తలపల్లికి చెందిన దుర్గేష్ స్థానిక కదిరి రోడ్డులో ద్విచక్ర వాహనంపై వస్తూ ఢీకొనడంతో నడుచుకుంటూ వెళ్తున్న వెంకటరాముడు గాయపడ్డాడు. ఆయా సంఘటనలపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రస్తా విషయంలో ఘర్షణ

బత్తలపల్లి : మండల పరిధిలోని డి.చెర్లోపల్లి గ్రామంలో రస్తా విషయంలో బుధవారం ఘర్షణ చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. డి.చెర్లోపల్లి గ్రామానికి చెందిన బోయ నరసింహులు వ్యవసాయ పొలం వద్దకు వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన లోకేశ్వరనాయుడు రస్తాకు బండి అడ్డు పెట్టాడు. ఈ విషయమై వారు ఘర్షణ పడ్డారు. లోకేశ్వరనాయుడు, బాలచంద్రనాయుడు, వెంకట రమణప్ప, బోయ నరసింహులు, నరేష్ ఒకరిపై ఒకరు రాళ్లు విసురుకున్నారు. ఈ ఘటనలో ఐదుగురూ గాయపడ్డారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

గోరంట్ల రూరల్ : మండల పరిధిలోని కదిరి-గోరంట్ల రహదారిపై కోరేవాండ్లపల్లి క్రాస్ వద్ద బుధవారం విజిలెన్స్ అధికారులు తనిఖీ చేసి అక్రమంగా తరలిస్తున్న 121.90 క్వింటాళ్ల (246 బ్యాగుల) పీడీఎస్ బియ్యాన్ని, ఐచర్ వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసి తహశీల్దార్ కార్యాలయంలో అప్పజెప్పారు. వాహన డ్రైవర్ బోయ చంద్ర, వాహన యజమాని క్రిష్ణయ్యపై గోరంట్ల పోలీసు స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడుల్లో ఎస్ఐ జి.జయపాల్ రెడ్డి, ఏఈఈ టి.కుళ్ళాయిరెడ్డి, సిబ్బంది, ఆర్ఐ ఎస్.సోమశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

కర్నాటక మద్యం....

ఓబుళదేవరచెరువు : మండల పరిధిలోని సున్నంపల్లి రోడ్డు వద్ద బుధవారం కర్నాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. అందిన సమాచారం మేరకు పోలీసు సిబ్బందితో కలిసి కాపు కాచి సున్నంపల్లి రోడ్డు వద్ద వి.తిప్పన్న అక్రమంగా కర్నాటక మద్యం రవాణా చేస్తుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. అతడి నుంచి కర్నాటక మద్యం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ కృష్ణారెడ్డి

నాణ్యమైన వైద్యసేవలందించండి

మడకశిర : గ్రామీణ ప్రాంతాల్లో ఆసుపత్రికి వచ్చిన రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని డిఎం హెచ్ఒ కృష్ణారెడ్డి ఆదేశించారు. ఆయన బుధవారం డిప్యూటీ డిఎంహెచ్ఒ మంజువాణితో కలిసి పట్టణంలోని వైద్య విధాన పరిషత్ ఆసుపత్రిని తనిఖీ చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. రోగులకు ఇబ్బందులు లేకుండా వైద్య సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

చదువే సంపద : అదనపు జిల్లా జడ్జి

హిందూపురం : క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకోవడం ద్వారా సంపద సృష్టించుకోవచ్చని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ మహిళలకు సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని సిపిఐ కాలనీ బాలికల వసతి గృహంలో బుధవారం జరిగిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. 14 ఏళ్ల లోపు పిల్లలను తప్పకుండా బడికి పంపాలన్నారు. 14-16 ఏళ్ల లోపు పిల్లలను ప్రమాదం లేని పనుల్లో నిర్దేశించిన సమయాల్లో పనులు చేయించుకోవాలన్నారు. యువతులకు 18 ఏళ్లు నిండిన తర్వాతే వివాహం చేయాలన్నారు. కార్యక్రమంలో టూ టౌన్ ఎస్ఐ కళావతి, న్యాయవాదులు సుదర్శన్, నవేరా, శివశంకర్, లైజనింగ్ అధికారి శ్రీనివాసులు, లోక్ అదాలత్ సిబ్బంది శారద, స్థానిక స్వయం సహాయక సంఘం నాయకురాలు ఆసియా భాను పాల్గొన్నారు.

ప్రజారోగ్యంతో సర్కారు చెలగాటం

పెనుకొండ : ప్రజల ఆరోగ్యంతో వైసిపి ప్రభుత్వం చెలగాటమాడుతోందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ పేర్కొన్నారు. ఆమె బుధవారం స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి నగర పంచాయతీలోని పలు వార్డుల్లో పర్యటించారు. ఆమె మాట్లాడుతూ వార్డుల్లో ఎక్కడ చూసినా చెత్త చెదారంతో పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోందని 4 రోజుల్లో తొలగించకపోతే ప్రజల భాగస్వామ్యంతో మేమే శ్రమదానం చేస్తామని ప్రభుత్వం, మున్సిపల్ చైర్మన్, కమిషనర్‌కు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మాధవనాయుడు, శ్రీరాములు, గుట్టూరు సూర్యనారాయణ, బాబుల్ రెడ్డి, సుబ్రమ ణ్యం, త్రివేంద్ర, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సిద్ధం కండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-హిందూపురం

నియోజకవర్గ వ్యాప్తంగా టిడిపి నాయకులు, కార్యకర్తలు ఎన్నికలకు సిద్ధం కావాలని ఎమ్మెల్యే నంద మూరి బాలకృష్ణ పిలుపునిచ్చారు. పట్టణంలోని జెవిఎస్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఆయన పట్టణంలోని వార్డుల వారీగా నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. బాలయ్య మాట్లాడుతూ మంత్రులతో పాటు ముఖ్యమంత్రి ఇక్కడికి వచ్చి ప్రచారం చేసినా తనను ఓడించ డం సాధ్యం కాదన్నారు. వచ్చే ఎన్నికల్లో హిందూపురం, కావలి పార్లమెంట్ స్థానాలను వడ్డెర్లకు కేటాయిం చేలా చర్యలు తీసుకోవాలని సంఘం నాయకులు బాలయ్యను కోరారు. కార్యక్రమంలో కొల్లకుంట అంజనప పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో యువత పాత్ర కీలకం : ఎమ్మెల్యే

పుట్టపర్తి అర్బన్ : రాబోయే ఎన్నికల్లో యువత పాత్ర ఎంతో కీలకమని, కష్టపడి పనిచేయాలని హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ పేర్కొన్నట్లు రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి అంబులెన్స్ రమేష్ తెలిపారు. రమేష్ బుధవారం హిందూపురంలో బాలయ్యను మర్యాదపూర్వకంగా కలసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశాడు. బాలయ్య మాట్లాడుతూ 2024 ఎన్నికలు ఎంతో కీలకమని తెలుగు యువత కష్టపడి పనిచేసి టిడిపిని గెలిపించుకోవాలని సూచించారన్నారు. వైసిపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం తేవాలని తెలిపారన్నారు.



బాలకృష్ణను సన్మానిస్తున్న రమేష్



వికలాంగుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే

ముదిగుబ్బ : మండల పరిధిలోని కొడవండ్లపల్లి, గంగిరెడ్డిపల్లి, ఇందుకూరు గ్రామాల్లో బుధవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ప్రజల సమస్య లు తెలుసుకున్నారు. ఇందు కూరులో పలువురు టిడిపి నుంచి వైసిపిలోకి చేరారు. కార్యక్రమంలో సివి. నారాయణరెడ్డి, ఇందుకూరు నారాయణరెడ్డి, జడ్పిటిసి తిరుమల సేవే నాయక్, కో ఆప్షన్ సభ్యు లు చిన్న బాలముని, వెంకటేశ్వర్ రెడ్డి, పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీ


రొద్దం : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం డాక్టర్ సిఎస్ సోమశేఖర్ ఆధ్వర్యంలో జిల్లా వైద్యాధికారులు డాక్టర్ తిప్పయ్య, లెప్రసీ ఎయిడ్స్ అండ్ టీబి ఆఫీసర్ జె.రాజేష్ సందర్శించారు. ఫార్మాసిస్టు దగ్గర టీబి రికార్డ్స్ లెప్రసీ రికార్డ్స్‌ను పరిశీలించారు. రొద్దం-1 గ్రామం లో ఎల్సిడిసిలో భాగంగా ఇళ్లను తనిఖీ చేశారు. అనంతరం వైద్య సిబ్బందిని సమావేశపరిచి వ్యాధుల లక్షణాలు, నివారణ చర్యలను వివరించారు.

12న 'చలో పార్లమెంట్' : ఎస్ఎఫ్ఐ

హిందూపురం : నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జనవరి 12వ తేదీ నిర్వహి స్తున్న చలో పార్లమెంట్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి పిలుపుని చ్చారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యావిధా నంతో విద్యా వ్యవస్థ నిర్వీర్యం అవడమే కాకుండా ప్రభుత్వ విద్య కార్పొరేట్ చేతుల్లోకి పోయే ప్రమాదం ఉందన్నారు.

పురం వైసిపి ఎంపి, ఎమ్మెల్యే సీట్లు మహిళలకే : మంత్రి

లేపాక్షి : హిందూపురం ఎంపి అభ్యర్థిగా శాంతమ్మ, ఎమ్మెల్యే అభ్యర్థిగా దీపికకు అవకాశం ఇవ్వడం ద్వారా సిఎం జగన్ వైసిపిలో మహిళలకు ఎంత ప్రాధాన్యత ఇస్తుందో చేసి చూపించారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డి పేర్కొన్నారు. మంత్రి బుధవారం మండల పరిధిలోని పులమితి, మానేంపల్లి, సిరివరం, కంచిసముద్రం, మైదుగోళం, లేపాక్షి పంచాయతీల్లో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ హిందూపురం నియోజకవర్గంలో ఇప్పటి వరకు మహిళలకు రాజకీయంగా ప్రాధాన్యత లేదని, వైసిపి వారికి అవకాశం ఇచ్చిందని వచ్చే ఎన్నికల్లో హిందూపురంలో వైసిపి జెండా ఎగరడం ఖాయమన్నారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, దీపిక, శాంతమ్మ, మండల కన్వీనర్ నారాయణస్వామి, జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచులు ఆదినారాయణ, అశ్వార్ధనారాయణ, వైస్ ఎంపీపీ అంజనరెడ్డి, ఎంపీటీసీ జైకిషన్, నాయకులు మధుమతిరెడ్డి, ఘని పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి, తదితరులు

రహదారి కోసం మంత్రిని అడ్డుకున్న మహిళలు

హిందూపురం : లేపాక్షి మండలం గౌరిగానిపల్లికి వెంటనే రహదారి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ బుధవారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని మానేంపల్లిలో మహిళలు అడ్డుకున్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో ఇప్పుడు గ్రామాలు గుర్తుకు వచ్చాయా అని మంత్రిని నిలదీశారు. స్పందించిన మంత్రి త్వరలో రహదారి నిర్మాణం చేపడుతామని హామీ ఇవ్వడంతో వారు శాంతించి వెనుదిరిగారు.

ఓటమి భయంతోనే జనసేనానిపై విమర్శలు : చిలకం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

టీడీపీ, జనసేన కలవడంతో వైసీపీలో వణుకు పుట్టి పవన్‌కల్యాణ్‌పై విమర్శలు చేస్తున్నారని, వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి నోరు అదుపులో పెట్టుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. ఆయన బుధవారం పట్టణం లోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఎన్నికల కమిషన్‌ను కలిసి వైసీపీ అక్రమాలపై ఫిర్యాదు చేయడం వైసీపీ నాయకులకు మింగుడు పడలేద న్నారు. జనసేనపార్టీకి గుర్తింపు లేదని విజయసాయిరెడ్డి పేర్కొనడం సిగ్గుచేటన్నారు. శివప్రసాద్ వైసీపీని స్థాపిస్తే జగన్ లాక్కున్నది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన ప్రభుత్వం ఏర్పాటవుతుందని ధీమా వ్యక్తం చేశారు. క్రికెటర్ అంబటిరాయుడు పట్టుమని పది రోజులు కూడా ఉండలేక రాజీనామా చేశారన్నారు. దీన్ని బట్టి చూస్తే సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి ఘోరపరాభవం ఖాయమని అర్థమవుతుందన్నారు.

నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

హిందూపురం : హిందూపూర్ జోన్ ప్రయివేట్ పాఠశాలల అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన 2024 క్యాలెండర్‌ను బుధవారం ఎంఇఒ గంగప్ప, అసోసియేషన్ అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వేణుగోపాల్, కోశాధికారి రియాజ్, హిందూపురం, పరిగి, గుడిబండ, మడకశిర, అమరాపురం, లేపాక్షి, చిలమత్తూరు మండలాల ప్రయివేట్ పాఠశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రయివేట్ పాఠశాలల అసోసియేషన్ సభ్యులు

17న ఉచిత కంటి వైద్య శిబిరం


ధర్మవరం టౌన్ : పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో(వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఎదురుగా) ఈ నెల 17వ తేదీ ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ రోటరీ క్లబ్ ఆధ్వర్యం లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్షులు జయసింహ, కార్యదర్శి నాగభూషణ, ఉపాధ్యక్షులు నరేందర్ రెడ్డి, క్యాంపు చైర్మన్ సుదర్శన్ గుప్తా తెలిపారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని సాంస్కృతిక మండలిలో శిబిరం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సభ్యులు నరేందర్‌రెడ్డి, రమేష్‌బాబు, గట్టు హరి, వెంకటేశులు, పెరుమాళ్ల దాసు, కొండయ్య, రత్నశేఖర్ రెడ్డి, సోలిగాళ్ల వెంకటేశులు, బోనాల శివయ్య పాల్గొన్నారు.

'జాబ్ క్యాలెండర్'పై తెలుగు యువత ఆధ్వర్యంలో ర్యాలీ

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

వైసీపీ ప్రభుత్వంలో ఏడాదికి ఓ జాబ్ క్యాలెండర్ వదులుతామని హామీలు ఇచ్చారే కానీ ఉద్యోగాలు ఎక్కడని తెలుగు యువత నాయకులు ప్రశ్నించారు. ముందుగా వారు ర్యాలీ నిర్వహించి ఎస్ఐ మల్లికార్జున్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ అబద్ధపు వాగ్దానాలు చేసి అధికారంకి వచ్చిన సిఎం జగన్ ప్రతి జనవరి 1వ తేదీ జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని చెప్పి ఐదేళ్లు ముగుస్తున్నా ఇప్పటికీ ఉద్యోగాలు భర్తీ చేయలేదని మండిపడ్డారు. కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు ఓబుల్‌రెడ్డి, అంబులెన్స్ రమేష్, బల్లార సుధాకర్, వైవి.మురళిసుధీర్, మనోహర్ మాల, మధుసూదన్‌రెడ్డి, నరేష్, శివప్రసాద్‌రెడ్డి, రామాంజనేయులు పాల్గొన్నారు.

పత్రిక ప్రకటన



ఆశ, లత ఒకే అమ్మాయి సత్యసాయి జిల్లా మడకశిర మండలం గౌడనహళ్లి గ్రామానికి చెందిన ఆశ తండ్రి పేరు దుర్గప్ప కర్ణాటక బ్యాంకులో ఆశకు బ్యాంక్ ఖాతా ఉందనీ బుధవారం తెలిపారు. ఆశ మాట్లాడుతూ అకౌంట్ 4892500101 లత పేరు మీద కర్ణాటక బ్యాంకులో ఉంది. అయితే ఒరిజినల్ పేరు ఆశ ఆధార్, రేషన్, 10వ తరగతి మార్కుకార్డ్ కార్డులలో ఆశ అని పేరు ఉంది. ఆశ లత ఒకే అమ్మాయి కాబట్టి పేర్లు ఒకరిదే కాబట్టి ఆశకు ఖాతాలో ఉన్న నగదు ఇవ్వాలని ఆశ కుటుంబ సభ్యులు కోరుతున్నారు.



తెలుగు భాషా ప్రతిభా పురస్కారం అందుకుంటున్న చాంద్‌బాషా



తెలుగు భాషా ప్రతిభా పురస్కారం అందుకుంటున్న కొండసాని రజిత

చాంద్‌బాషా, రజితలకు తెలుగు భాషా సేవా ప్రతిభా పురస్కారం

ప్రజాశక్తి-పెనుకొండ

ఎపి రాష్ట్ర అధికార భాషా సంఘం, తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ అనంతపురం జెఎన్‌టియు ఆడిటోరియంలో మంగళవారం రాత్రి నిర్వహించిన 'అనంత తెలుగు భాషా వైభవ సదస్సు'లో జాబిలి చాంద్‌బాషాకు తెలుగు భాషా సేవా ప్రతిభా పురస్కారం అందజేశారు. సంఘం అధ్యక్షులు విజయ్‌బాబు, జెఎన్‌టియు విసి చింతా సుధాకర్, ప్రెస్ అకాడమీ ఛైర్మన్ శ్రీనివాస్‌రావు నుంచి చాంద్‌బాషా ఈ పురస్కారం అందుకున్నారు. రాయలసీమ రైతుల స్థితిగతులపై జాబిలి రాసిన 'మట్టిని ముద్దాడిన మనిషి' పుస్తకం ప్రపంచ వేదికపై ప్రశంసలు అందుకొంది. జాబిలి 25 ఏళ్లుగా తెలుగు భాష సేవకు ఎనలేని సేవలు చేశారని, గుర్తింపుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిభా పురస్కారంతో సత్కరించడం ఉమ్మడి అనంతపురం జిల్లాకు గర్వకారణమని ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి, డాక్టర్ శాంతి నారాయణ తెలిపారు.

కొండసాని రజితకు తెలుగు భాష సేవా ప్రతిభా పురస్కారం

పుట్టపర్తి రూరల్ : మండల పరిధిలోని సుబ్బరాయునిపల్లి గ్రామానికి చెందిన కొండసాని(అయ్యగారి) రజిత మంగళవారం అనంతపురం నగరంలోని జేఎన్టీయూ ఆడిటోరియంలో తెలుగు భాష సేవా ప్రతిభా పురస్కారం అందుకున్నారు. ఈమె ప్రస్తుతం గోరంట్ల మండలంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నారు.



ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమంలో పాల్గొన్న అఖిలపక్షం నాయకులు

ఓటరు వెరిఫికేషన్ సమావేశానికి టిడిపి నాయకులు

మడకశిర : పట్టణంలో బుధవారం సబ్ కలెక్టర్ నిర్వహించిన ఓటరు వెరిఫికేషన్ సమావేశానికి అఖిలపక్ష పార్టీ నాయకులు హాజరయ్యారు. వీరిలో టిడిపి తరఫున మనోహర్, లక్ష్మీనారాయణ, భక్తర్ సన్నీ రప్ప, పుల్లయ్య చౌదరి, మల్లికార్జున, సిపిఎం నుంచి పవిత్ర, ఇతర పార్టీల నాయకులు కృష్ణమూర్తి, తదిత రులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమాన్నిపకడ్బందీగా చేపట్టాలని తెలి పారు.

జగనన్న ఆరోగ్య సురక్ష

హిందూపురం : పట్టణంలోని 13, 20వ వార్డులకు సంబంధించి బుధవారం ఇందిరా నగర్ ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ ప్రారంభించారు. కార్యక్రమంలో కమిషనర్ ప్రమోద్ కుమార్, పలువురు కౌన్సిలర్లు, ఎంఈ వెంకటరమణ, డిఈ వాణి, వైసిపి నాయకులు, మున్సిపల్ అధికారులు, వైద్యులు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి పట్టణ అధ్యక్షుడికి సన్మానం

ధర్మవరం టౌన్ : టిడిపి పట్టణ అధ్యక్షుడిగా నూతనంగా ఎంపికైన పరిశే సుధాకర్‌ను బుధవారం పలువురు పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. మాజీ కౌన్సిలర్ సుశీలామూర్తి, మాదనమహేశ్వరి, నాయకులు మాదన సుబ్బయ్య, అత్తర్ రహీం, మున్నీ, బిల్లే శీన, స్వర్ణకుమారి పరిశే సుధాకర్‌ను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. పరిశే సుధాకర్ మాట్లాడుతూ అందరం కలిసికట్టుగా టిడిపి గెలుపు కోసం పనిచేద్దామన్నారు. పరిటాల శ్రీరామ్‌ను ఎమ్మెల్యేగా గెలుపించుకునే బాధ్యత కూడా మనపై ఉందన్నారు.



టిడిపి పట్టణ అధ్యక్షుడిని సన్మానిస్తున్న నాయకులు

బీసీల ద్రోహి జగన్మోహన్ రెడ్డి

ప్రజాశక్తి-బుక్కపట్నం

బీసీ కార్పొరేషన్లకు నిధులు మంజూరు చేయకుండా బీసీలను నమ్మక ద్రోహం చేసిన వ్యక్తి సిఎం జగన్ అని టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ విమర్శించారు. బుక్కపట్నంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచింది టిడిపినే అన్నారు. బీసీలకు రిజర్వేషన్లు పెంచి పదవులు ఇచ్చిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. రాబోయే ఎన్నికల్లో బీసీలు ఏకతాటిపైకి వచ్చి టిడిపిని గెలిపించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో బాలు, లావణ్య గౌడ్, నాయకులు గొర్ల కృష్ణ, రామకష్ణ, ఈశ్వరయ్య, మంజునాథ్, శ్రీరాములు, చెన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

'జయహో బిసి' ప్రచార రథం ప్రారంభం

మడకశిర : జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు కుంటిమద్ది రంగయ్య ఆధ్వర్యంలో పెనుకొండ పట్టణంలోని టిడిపి కార్యాలయంలో బుధవారం జిల్లా అధ్యక్షులు పార్థసారథి, మడకశిర నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి 'జయహో బిసి' ప్రచార రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర వక్కలిగ సాధికార కన్వీనర్ విఎం పాండురంగప్ప,రమణ, రంగయ్య, దుర్గేష్, రామంజి, మంజునాథ, తిప్పేస్వామి, శ్రీనివాసులు, రామచంద్ర, నారాయణప్ప పాల్గొన్నారు.



'జయహో బిసి' ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న గుండుమల తిప్పేస్వామి

వైసిపి శ్రేణులతో పార్లమెంట్ ఇన్‌ఛార్జి సమావేశం

మడకశిర : పట్టణంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో బుధవారం సాయంత్రం హిందూపురం పార్లమెంట్ వైసీపీ ఇన్‌ఛార్జి శాంతమ్మ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సిఎం జగన్ ఆదేశాలతో మడకశిర ప్రాంతానికి కొత్తగా వచ్చానన్నారు. ప్రజలు నన్ను ఒక అక్క, చెల్లెమ్మగా ఆదరించి గెలిపించాలని కోరారు. బళ్ళారిలో ఓ సారి ఎంపీ అభ్యర్థిగా గెలిచానన్నారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ పుట్ట కామప్ప, తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేటు పాఠశాలలపై చర్యలు తీసుకోండి

కొత్తచెరువు : సంక్రాంతి సెలవుల్లో తరగతులు నిర్వహించే ప్రయివేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగార్జున, జిల్లా ఉపాధ్యక్షులు పవన్‌కుమార్ డిఇఒ మీనాక్షికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఈ నెల 18వ తేదీ వరకూ సెలవులు ప్రకటించిందని, కావున ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు సెలవుల్లో ఎలాంటి తరగతులు నిర్వహించరాదని హెచ్చరించారు. కార్యక్రమంలో సాకే హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలో గౌడనహళ్లి విజయం

మడకశిర : 'ఆడుదాం ఆంధ్ర'లో భాగంగా బుధవారం మండల పరిధిలోని గౌడనహళ్లి పంచాయతీ పరిధిలో క్రీడాపోటీలు నిర్వహించారు. అందులో ఆమిదాలగొంది, గౌడనహళ్లి క్రికెట్ జట్ల మధ్య జరిగిన పోటీలో గౌడనహళ్లి పంచాయతీ జట్టు విజయం సాధించింది. ముందుగా గౌడనహళ్లి జట్టు 8 వికెట్లు కోల్పోయి 71 పరుగులు చేయగా ఆమిదాలగొంది జట్టు నిర్ణీత ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 60 పరుగులు మాత్రమే చేసి ఓటమిపాలైంది.

గ్రామాల్లో పంటకోత ప్రయోగాలు

బత్తలపల్లి : మండల పరిధిలోని రాఘవంపల్లి, ఈదుల ముష్టూరు గ్రామాల్లో రైతులు సాగు చేసిన కంది పంటలో బుధవారం వ్యయసాయ అధికారులు పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. ఎఎస్ డాక్టర్ లక్ష్మీనరసింహశర్మ మాట్లాడుతూ వైఎస్ఆర్ పంట బీమా, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద పంటకోత ప్రయోగాలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఇఒ ఉపేంద్రరెడ్డి, వివిహెచ్ సత్యనారాయణ, బీమా అధికారి నాగభూషణం, రైతులు సరస్వతి, మంగమ్మ పాల్గొన్నారు.

రామాలయానికి ఉపాధ్యాయుని విరాళం

పుట్టపర్తి రూరల్ : మండల పరిధిలోని సుబ్బరాయనిపల్లి గ్రామంలో నిర్మించతలపెట్టిన రామాల యానికి పెడపల్లి తండా గ్రామానికి చెంది న ఉపాధ్యాయుడు లక్ష్మానాయక్ బుధవారం ఆ గ్రామం వెళ్లి ఆలయ నిర్వాహకులు, మాజీ సైనికు డు ముద్దుల మహానందకు విరాళం అందజేశారు. కార్యక్రమంలో కేశవ జయచంద్ర, హరీష్, నారాయ ణప్ప, సతీష్‌కుమార్, బొమ్మయ్య, జయరామిరెడ్డి, వడ్డీ నాగరాజు, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని వినతి

కొత్తచెరువు : మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని గోరంట్లపల్లి గ్రామంలో ఎస్సీల శ్మశానవాటిక కు స్థలం కేటాయించాలని డిసిఎంసి మెంబర్ రామాంజనేయులు, గ్రామస్తులు లక్ష్మీదేవి, రామప్ప, కుళ్లాయమ్మ, రామాంజనేయులు తహశీల్దార్ రామాంజనేయరెడ్డికి బుధవారం వినతిపత్రం అందజేశా రు. వారు మాట్లాడుతూ చాలా ఏళ్లుగా ఎస్సీల శ్మశానవాటికకు స్థలం లేకపోవడంతో దహన సంస్కా రాలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, తక్షణమే స్థలం కేటాయించాలని కోరారు.

ఆడుదాం ఆంధ్ర పోటీలు

రొద్దం : 'ఆడుదాం ఆంధ్ర'లో భాగంగా బుధవారం స్థానిక జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన పోటీలను బుధవారం ఎంపీపీ చంద్రశేఖర్, సర్పంచి రూప రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ ఉన్న క్రీడాకారులను వెలికితీసేందుకే సిఎం జగన్ 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమాన్ని రూపొందించారని తెలిపారు. కార్యక్రమంలో ఎం.పి.డి.ఓ.రాబర్ట్ విల్సన్, పెను కొండ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ కలిపి శ్రీనివాసులు, మండల కన్వీనర్ బోయ తిమ్మయ్య, మండల స్పెషల్ ఆఫీసర్ నరసయ్య, పిఇటిలు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ సెక్రెటరీలు, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ కిట్లు పంపిణీ

కదిరి టౌన్ : పట్టణంలోని న్యూ హరిజనవాడకు చెందిన 10వ వార్డ్ సచివాలయంలో బుధవారం వైసిపి పట్టణ మాజీ అధ్యక్షులు బహవుద్దీన్ క్రీడాకారులు శంషిర్, సద్దాం, ఫయాజ్, షామీర్‌లకు ఆడుదాం ఆంధ్ర కిట్లను అందజేశారు. అనంతరం విజయవాడలో ఈ నెల 19న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 125 అడుగుల కాంస్య విగ్రహావిష్కర నేపథ్యంలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లతో కలిసి సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో ఆసిఫ్, కార్తీక్, బాబ్‌జాన్, కృష్ణమూర్తి, శివమ్మ, శాంత, వాలంటీర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్తకు పరామర్శ

కొత్తచెరువు : మండల పరిధిలోని తలమర్ల గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త గంగాధర్ ఆసుపత్రిలో చికిత్స పొంది అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా బుధవారం మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి ఆయన ఇంటికెళ్లి పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట నాయ కులు బాలకృష్ణారెడ్డి, బోయ రాజు, షర్ఫుద్దీన్, వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలి

మడకశిర : అంబేద్కర్ ఆశయాలను చిత్తశుద్ధితో అమలు చేయాలని డిహెచ్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎంఆర్ హనుమంతు ప్రభుత్వాలను కోరారు. పట్టణంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అంబేద్కర్ ఈ నెల 19వ తేదీ జరిగే 125 అడుగుల అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాల అములుకై దళిత, గిరిజనులకు సంబంధించిన 28 సంక్షేమ పథకాలను రద్దు చేసి దళితులను దగా చేయడం బావ్యం కాదన్నారు.

టిడిపి కార్యకర్తకు ఆర్థికసాయం

నల్లచెరువు : మండల పరిధిలోని కె.పూలకుంట గ్రామానికి చెందిన ఆదెప్ప భార్య టిడిపి సీనియర్ కార్యకర్త నిర్మలమ్మ బుధవారం మృతిచెందింది. దీంతో కదిరి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ ఆదేశాల మేరకు మండల టిడిపి యువ నాయకులు లక్ష్మీపతి నాయుడు, పూలకుంట గ్రామానికి చెందిన గంగాధర్ నిర్మలమ్మ మృతదేహానికి పూలమాల వేసి సంతాపం తెలిపి భర్త ఆదెప్పకు రూ. 5వేలు అందజేశారు. కార్యక్రమంలో రాజుయాదవ్, అబ్దుల్లా, మల్లికార్జున, హరి, బాబాఫక్రుద్దీన్, ఇంతియాజ్, శ్రీనివాసులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బత్తలకు ఎమ్మెల్యే పరామర్శ

కదిరి టౌన్ : రూరల్ మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లి మాజీ సర్పంచ్ బత్తల వెంకటరమణ మోకాళ్లకు ఆపరేషన్ చేయించుకుని ఆసుపత్రి నుంచి ఇంటికి వచ్చి విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డి బుధవారం వారి నివాసానికి వెళ్లి పరామర్శించి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యేతో పాటు మణికంఠనాయక్ ఉన్నాడు.



బత్తల వెంకటరమణను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డి